క్లుప్తంగా

కళాశాలలో ఫొటో ఎగ్జిబిషన్



ఫొటోఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం

కాగజ్‌నగర్‌టౌన్: అంబేద్కర్ జయంతి సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఫొటో ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. హిందీ విభాగం, రాజనీతిశాస్త్రం విభాగాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అంబేద్కర్ జీవితంలోని ముఖ్యఘట్టాలను సేకరించి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం మాట్లాడుతూ దేశం గర్వించదగిన ప్రముఖ వ్యక్తి అంబేద్కర్ అన్నారు. అంబేద్కర్ జీవితం అందరికీ ఆదర్శంమన్నారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ రాజు, అధ్యాపకులు రాజేశ్వర్, దత్తాత్రేయ, టీమాజీ, మహేశ్, దేవేందర్, శారద, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

వట్టివాగు నీటి విడుదల కొనసాగించాలి



ఇరిగేషన్ ఈఈకి వినతిపత్రం అందిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్‌కుమార్

రెబ్బెన: వట్టివాగు ప్రాజెక్టు ద్వారా నీటి విడుదలను మరికొన్ని రోజులు కొనసాగించాలని రెబ్బెన పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్ కోరారు. ఈ మేరకు ఇరిగేషన్ ఈఈ గుణవంతరావును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వట్టివాగు ప్రాజెక్టు కాలువల కింద మండలంలోని రైతులు వరితో పాటు ఇతర పంటలు సాగు చేస్తున్నారని అన్నారు. మరికొన్ని రోజుల్లో పంటలన్నీ చేతికందే దశలో ఉన్నాయని ఈ తరుణంలో ఎండిపోకుండా వట్టివాగు ద్వారా సాగునీటి సరఫరా చేయాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు వెంకటేశం చారి తదితరులు ఉన్నారు.

'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోవాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ విశ్వనాథ్

కౌటాల: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ కోరారు. మండలంలోని గురుడుపేట పంచాయతీ కార్యాలయంలో గురువారం ఆయన కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంటివెలుగు పరీక్ష కేంద్రం వద్ద ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఈనెల 21 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. సర్పంచ్ మెర్పల్లి సునంద, వైస్ ఎంపీపీ నికాడే అమ్మక్క, ఉప సర్పంచ్ సుజాత, మాజీ ఎంపీపీ గంగారాం, రైతు సమితి మండల కన్వీనర్ మెర్పల్లి బ్రహ్మయ్య, వైద్యాధికారి అజ్మీర రాజ్‌కుమార్, కార్యదర్శి సాయికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

సీఓఈ ప్రవేశపరీక్షలో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

సిర్పూర్(టి): సాంఘిక సంక్షేమ గురుకులాలు నిర్వహిస్తున్న స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) కళాశాలల్లో సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షలో నలుగురు విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమశాఖ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన విద్యార్థులు సీటు సంపాదించారు. ప్రిన్సిపాల్ బాలరాజు, అధ్యాపకులు గురువారం వారిని అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ ఫ్రాన్సిస్, ఉపాధ్యాయులు ప్రవీణ్, వెంకటేశ్వర్లు, వినోద్‌కుమార్, అబ్దుల్ మాలిక్, భరత్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన

కెరమెరి: మండలంలోని తోయగూడ అటవీ ప్రాంతంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీపీ పెందోర్ మోతిరాం గురువారం పరిశీలించారు. అధిక సమయం పనిచేస్తే ఎక్కువ కూలీ డబ్బులు వస్తాయన్నారు. అందుకు కూలీలు తెల్లవారుజాము నుంచి ఎండ కాకముందే పని ముగించుకోవాలన్నారు. ఆయన వెంట టీఏ ధరంసింగ్ ఎఫ్ఏలు ఉన్నారు.

మెరుగుపడనున్న వైద్యసేవలు

- నాలుగు సబ్ సెంటర్లకు పక్కా భవనాలు
- స్థల వివాదంతో ప్రారంభం కాని నారాయణపూర్ పనులు
- ప్రారంభోత్సవానికి అధికారుల సన్నాహాలు



రెబ్బెనలో పూర్తయిన సబ్ సెంటర్ పనులు

రెబ్బెన: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన ప్రభుత్వ వైద్యసేవలు అందనున్నాయి. ప్రభుత్వం ఓ వైపు పల్లె దవాఖానలు ఏర్పాటు చేస్తుండగా క్షేత్రస్థాయిలో ప్రజలకు వైద్యసేవలను మరింత అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టింది. తాజాగా సబ్ సెంటర్లు పక్కా భవనాల కోసం నిధులు మంజూరు చేయగా టెండర్ల ద్వారా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు చకాచకా పనులు చేపట్టి నిర్మాణాలు పూర్తి చేశారు.

రూ.80 లక్షలతో 5 భవనాలు..

మండలంలోని గోలేటి, రెబ్బెన, నంబాల, నారాయణపూర్, కై రిగాం, నవేగాంలలో సబ్ సెంటర్లు ఉన్నాయి. కేవలం గోలేటికి మాత్రమే పక్కా భవనం ఉండేది. మిగిలినవి అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య నిర్వహించడంతో వైద్యసిబ్బంది, రోగులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులకు గురయ్యేవారు. ప్రభుత్వం నేషనల్ హెల్త్ మిషన్ నిధులతో మండలానికి రూ.80 లక్షలతో 5 సబ్‌సెంటర్లకు పక్కా భవనాలు మంజూరు చేసింది. ఒక్కోటికి రూ.16 లక్షలు కేటాయించింది. గతేడాది టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లకు పనులు అప్పగించింది. నంబాల, రెబ్బెన, కైరిగాం, నవేగాంలలో ఇప్పటికే నిర్మాణ పనులు పూర్తి కాగా, నారాయణపూర్‌లో స్థల వివాదం కారణంగా పనులు ప్రారంభించలేదు. నిర్మాణం పూర్తయిన భవనాలు త్వరలో ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

అందనున్న మెరుగైన సేవలు..

మండలంలోని సబ్ సెంటర్లకు త్వరలో పక్కా భవనాలు అందుబాటులోకి రానుండటంతో ప్రజలకు సైతం క్షేత్రస్థాయిలో మెరుగైన వైద్యసేవలందనున్నాయి. ప్రస్తుతం ఒక్కో సబ్‌సెంటర్ పరిధిలో ఒక ఏఎన్ఎం, ఇద్దరు ఆశావర్కర్లు పని చేస్తున్నారు. ఆయా సెంటర్ల పరిధిలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులకు వైద్యసేవలందిస్తున్నారు. దానికి తోడు పక్కా భవనాలు అందుబాటు లోకి రానుండటంతో వైద్యసిబ్బంది ఉత్సాహంతో ఉన్నారు. అన్ని వసతులు పక్కా భవనంలో ఉండేలా ఇంజినీరింగ్ అధికారులు రూపకల్పన చేసి నిర్మాణాలు చేపట్టారు. క్షేత్రస్థాయిలో మెరుగైన వైద్యసేవలు అందనుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ మహాసభలు విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఇఫ్టూ నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో ఈనెల 16 నుంచి 18 వరకు నిర్వహించే ఇఫ్టూ 7వ జాతీయ మహాసభలు విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఇఫ్టూ) ఏరియా కార్యదర్శి గోలేటి శ్రీనివాస్ కోరారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సివిక్ కార్యాలయం ఆవరణలో జాతీయ మహాసభల పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల కార్పొరేట్‌కు అనుకూలంగా లేబర్‌కోడ్ల అమలు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ వంటి మోడీ సంస్కరణలకు వ్యతిరేకంగా దేశ కార్మిక వర్గానికి అండగా నిలిచేలా జాతీయ మహాసభలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. నాయకులు చందు, కుమార్, భీమయ్య, బాపు, సావిత్రి, గోపాల్, సంతోష్, పోసుబాయి, రాణి, నాగలక్ష్మి, కమల, తార తదితరులు పాల్గొన్నారు.

భానుడి ప్రతాపం

కౌటాల: జిల్లాలో గతవారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. జిల్లాలో గురువారం ఎండలు భగభగమంటున్నాయి. వేడిగాలులు వీస్తుండడంతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు, అధికారులు సూచిస్తున్నారు. రద్దీ ప్రాంతాల్లో అధికారులు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. జిల్లాలో గురువారం కెరమెరిలో పగటి ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు నమోదయ్యాయి.

గురువారం జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలు

	గరిష్టం	కనిష్టం
కెరమెరి	43	25.3
బెజ్జూర్	42.3	27.3
కాగజ్‌నగర్	42.2	23.9
తిర్యాణి	42.1	26.2
ఎల్కపల్లి	42.1	27.3
వంకులం	42	25.9
కౌటాల	41.6	26.8
ఆసిఫాబాద్	41.4	25
వాంకిడి	40.8	24.8
రెబ్బెన	40.8	25.5

బంక్‌లో ఇంధనం ఎప్పుడు?

- సేవాలాల్ సేనా జిల్లా అధ్యక్షుడు రూప్‌లాల్ రాథోడ్



మాట్లాడుతున్న రూప్‌లాల్ రాథోడ్

కెరమెరి: మండల కేంద్రంలో ఐటీడీఏ, జీసీసీ సౌజన్యంతో ప్రారంభించిన పెట్రోల్ బంక్‌లో ఇంధన ఎప్పుడు వస్తుందని సేవాలాల్ సేనా జిల్లా అధ్యక్షుడు రూప్‌లాల్ రాథోడ్ ప్రశ్నించారు. గురువారం ఆయన వినియోగదారులతో కలిసి బంక్‌ను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కనీసం ఇరవై రోజులకు పైబడి అవుతున్నా పెట్రోల్, డీజిల్ తెప్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని అన్నారు. రెండు, మూడు రోజులు నడిస్తే వారాల తరబడి మూతబడి ఉంటుందని, నిర్వహణ కష్టమనిపిస్తే ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలన్నారు. బంక్‌లో పెట్రోల్, డీజిల్ లేక ప్రైవేటు వ్యక్తులు అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో రాథోడ్ రమేశ్, ఆడే ఉత్తం తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్: జిల్లాకేంద్రంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ 129వ వార్షికోత్సవం పురస్కరించుకొని గురువారం కళాజాత బృందం ద్వారా ప్రజలకు సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. బ్యాంకు ద్వారా సామాజిక భద్రత పథకాలు, ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన, జీవనజ్యోతి, బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, సైబర్ మోసాలపై ప్రజలకు అర్థమయ్యేరీతిలో పాటలు, మాటలు, మ్యాజిక్ షో ద్వారా అవగాహన కల్పించారు. బ్యాంకు మేనేజర్ మహ్మద్ ఖాజా మొయినొద్దీన్, ఫీల్డ్ ఆఫీసర్ రాజ్‌కుమార్, క్యాషియర్ సుధీర్, సిబ్బంది, కళాజాత బృందం సభ్యులు విజయ్, పాల్గొన్నారు.

టీహెచ్ఆర్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



అదనపు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీహెచ్ఆర్ రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్

ఆసిఫాబాద్: తెలంగాణ వైద్యారోగ్య శాఖమంత్రి తన్నీరు హరీశ్‌రావు సేవా సమితి(టీహెచ్ఆర్) ఆధ్వర్యంలో జిల్లాలో త్వరలో సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు రాళ్లబండి విజయ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ చాహత్‌బాజ్‌పాయ్‌ను గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట సంఘం జిల్లా అధ్యక్షుడు బాబూగౌడ్ తదితరులు ఉన్నారు.

మాతా శిశు మరణాలు తగ్గించేందుకు చర్యలు



మాట్లాడుతున్న రామకృష్ణ

బెజ్జూర్: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాతా శిశు మరణాలు తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వార్డులను పరిశీలించారు. ప్రభుత్వ నిర్వహిస్తున్న కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలోని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ పట్టణాల్లో మహిళ క్లినిక్‌లు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 59 హెల్త్ సెంటర్లు పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగజ్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్ఓ సీతారాం నాయక్, వైద్యులు అవినాష్, సుంకన్న, డీఐవో కృష్ణప్రసాద్, సీహెచ్‌వో హైజాక్ హెచ్‌ఐవో కోటేశ్వర్, హెచ్ వి రేణుక పాల్గొన్నారు.

వాటర్ కూలర్లు ఏర్పాటు చేయాలి



మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి డిస్పెన్సరీలో వాటర్ కూలర్లు ఏర్పాటు చేయాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు కోరారు. గురువారం డిస్పెన్సరీ సిబ్బందితో కలిసి మెడికల్ ఆఫీసర్ స్టాలిన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రతతో ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఉక్కపోతతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఏరియాలోని అన్ని విభాగాలకు యాజమాన్యం వేసవి ఎండల తీవ్రత దృష్టిలో పెట్టుకుని కూలర్లు ఏర్పాటు చేస్తోందని, అదే తరహాలో డిస్పెన్సరీలో ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు శ్రీనివాస్, రాజశేఖర్, శంకర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్ల నిర్మాణానికి కృషి



భూమి పూజ చేస్తున్న ఎంపీపీ విశ్వనాథ్

కౌటాల: గ్రామాల్లోని కాలనీల్లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్ల నిర్మాణం త్వరలో పూర్తి చేస్తామన్నారు. సర్పంచ్ వొజ్జల మౌనిక్, ఉప సర్పంచ్ తిరుపతి, కార్యదర్శి సాయికృష్ణ, నాయకులు దాగం ఆగయ్య, డబ్బా బాపు, నాహీం తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం జరిగేలా చూస్తాం

- జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి



జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

రెబ్బెన(ఆసిఫాబాద్): పులికుంట సమీపంలో ఏర్పాటు చేస్తున్న రైల్వే నాలుగో లైన్‌లో ఇళ్లు కోల్పోతున్న బాధితులకు అన్నివిధాలుగా న్యాయం జరిగేలా చూస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. రైల్వేలైన్ ఏర్పాటులో తొలగించనున్న 12 ఇళ్లను గురువారం పరిశీలించారు. బాధితులు జెడ్పీ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందించారు. బాధితులు మాట్లాడుతూ రైల్వేలైన్ ఏర్పాటుతో ఉన్న కొద్దిపాటి ఇళ్లు కూడా తొలగిస్తే రోడ్డున పడుతామని, ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరారు. జాతీయ రహదారి ఏర్పాటులో గ్రామానికి ప్రత్యేకంగా సర్వీస్ రోడ్డు నిర్మించకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఎన్‌హెచ్ఏఐ అధికారులతో మాట్లాడి సర్వీస్ రోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తామని, ఇళ్లు కోల్పోతున్న వారికి ప్రభుత్వ పరంగా సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ సౌందర్య, జెడ్పీటీసీ సంతోష్, తహసీల్దార్ మల్లికార్జున్, సర్పంచ్ పోషమల్లు, ఎంపీటీసీ సంఘం శ్రీనివాస్, రెబ్బెన ఉప సర్పంచ్ మడ్డి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

- డీఈవో అశోక్
- మన ఊరు- మన బడి పనులపై సమీక్ష



మాట్లాడుతున్న డీఈవో అశోక్

దహెగాం(సిర్పూర్): విద్యాప్రమాణాలు పెంచాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మన ఊరు- మన బడి కార్యక్రమం పనులు వేగవంతం చేయాలని డీఈవో అశోక్ ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం మన ఊరు- మన బడి కార్యక్రమంపై ఎస్ఎంసీ చైర్మన్లు, సర్పంచులు, ప్రధానోపాధ్యాయులతో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ జిల్లాలోనే మన ఊరు- మనబడి పనుల పురోగతిలో దహెగాం మండలం వెనుకబడి ఉందని తెలిపారు. పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలంలో 19 పాఠశాలలను మొదటి విడతలో ఎంపిక చేశామని, పనులు పూర్తయిన పది రోజుల్లో బిల్లులు వస్తాయని తెలిపారు. పనులు పూర్తయిన వెంటనే ఎంబీ రికార్డు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలల వారీగా సమీక్షించారు. పనులు ఏ మేరకు పూర్తి చేశారు.. ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి.. బిల్లులు ఎంత వచ్చాయి.. తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మన ఊరు- మన బడి జిల్లా కోఆర్డినేటర్ భరత్, ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్, ఎంఈవో భిక్షపతి, పీఆర్ ఏఈ ఆత్మారాం, సర్పంచులు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వేతన సవరణ కమిటీని నియమించాలి



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: 2023 వేతన సవరణ కమిటీని నియమించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందులాల్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఎగరేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 పీఆర్సీ గడువు జూన్ 30, 2023తో ముగియనున్నందున వెంటనే నియమించిన ఉద్యోగ ఉపాధ్యాయులకు నూతన వేతన స్థిరీకరణ చేయాలన్నారు. బదిలీలు పదోన్నతుల పై కోర్టులో ఉన్న అన్ని కేసులు పరిష్కరించాలని కోరారు. సంఘం నాయకులు హేమంత్, ఉషన్న, ఎల్లయ్య, ఉపేందర్, సుభాష్ తదితరులు ఉన్నారు.

అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి



వెళ్తున్న నేతలు, అధికారులు

కౌటాల: బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను గ్రామాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించాలని బౌద్ధ సమాజ్ సంఘం తాలుకా అధ్యక్షుడు బసర్కార్ విశ్వనాథ్ ఓ ప్రకటనలో కోరారు. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాలని సూచించారు. కౌటాల బుద్ధ విహార్‌లో నిర్వహించే జయంతి వేడుకల్లో మహార్ కులస్తులు పాల్గొనాలని కోరారు. జయంతి సందర్భంగా ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హైదరాబాద్‌కు బయల్దేరిన నేతలు

కెరమెరి: హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా శుక్రవారం 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన చేయనున్నారు. మండలంలోని 31 పంచాయతీలకు చెందిన నేతలు, ప్రజలు గురువారం హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్లారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులో పయనమయ్యారు.

బావి పనులు ప్రారంభం

కెరమెరి: మండలంలోని జోడేఘాట్‌లో బావి పనులు జోరందుకున్నాయి. నాలుగు రోజుల క్రితం ఎంపీడీవోతోపాటు ఇతర అధికారులు జోడేఘాట్‌కు వెళ్లి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న విషయం విధితమే. నీటి సమస్య అధికంగా ఉందని ప్రజలు తెలపడంతో గురువారం బావి తవ్వకాలు ప్రారంభించారు. తాగు నీరు ఎలాగైనా లభిస్తున్నప్పటికి పల్లె ప్రకృతివనం, నర్సరీ మొక్కలతోపాటు కుమురం భీం పార్క్‌లో ఏర్పాటు చేసిన మొక్కలకు నీటి తీవ్రత ఏర్పడింది. దీంతో నిర్జీవమయ్యే అవకాశం ఉంది. అక్కడున్న బోరుబావులు అన్ని సీజనెబుల్ కావడంతో క్రమక్రమంగా భూగర్భజలం ఇంకిపోతుంది.

గుండాయిపేటలో పంట కోత ప్రయోగం

కౌటాల: పంటకోత ప్రయోగంతో పంట దిగుబడిని అంచనా వేయవచ్చని ఏఈవో చౌదరి అంజన్న అన్నారు. మండలంలోని గుండాయిపేటలో మొక్కజొన్న పంట కోత ప్రయోగం చేశారు. రైతులు ఉన్నారు.

సమయపాలన పాటించని టీచర్లపై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని గురువారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో డీటీడీవో మణెమ్మకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మధ్యాహ్నం 12 గంటలకు అందించాల్సిన భోజనాన్ని 11 గంటలకే వడ్డించి విద్యార్థులను పంపిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు కల్యాణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డీటీడీవోను సరెండర్ చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్: అవినీతికి పాల్పడిన డీటీడీవోను వెంటనే సరెండర్ చేయాలని ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ, కేవీపీఎస్ నాయకులు చిరంజీవి, కార్తీక్, దినకర్‌లు ఈ-మెయిల్ ద్వారా ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డికి గురువారం ఫిర్యాదు చేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు 2022-23 విద్యా సంవత్సరంలో పంపిణీ చేయాల్సిన ప్లేట్లు, గ్లాసులకు సంబంధించిన నిధులు రూ.11.59 లక్షలు గుట్టుచప్పుడు లేకుండా విత్ డ్రా చేసుకున్నారని, విద్యార్థులకు మాత్రం ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేయలేదన్నారు. దీనిపై విచారణ జరిపించి డీటీడీవోను సరెండర్ చేయాలని డిమాండ్ చేశారు.

పరీక్ష ప్యాడ్లు అందజేత



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని చోర్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బాలల సంరక్షణ విభాగం వర్కర్ ప్రవీణ్ కుమార్ గ్రామస్తులతో కలిసి గురువారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. మార్కెట్ కమిటీ సభ్యుడు పోషన్న, కార్యదర్శి వెంకటీ, ఆశన్న తదితరులున్నారు.

నేడు రక్తదాన శిబిరం

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఎల్లగౌడ్ తోటలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం ఉదయం 10 గంటలకు రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు దాసరి వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి కొంగ సంపత్ ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి దాతలు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

నేడు మెగా వైద్యశిబిరం

కాగజ్‌నగర్‌రూరల్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా మండలంలోని చింతగూడ కోయవాగులో ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు పాల్వాయి హరీశ్‌బాబు తెలిపారు. ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.